పెద్ద కథ

# "వర్షం వెలిసేసరికి...."

"శ్రీ"

మంచి మండువేసవి వైశాఖమాసం. సాయంత్రము అయిదు గంటలయిందో లేదో-అంతవరకు విపరీతమైన ఎండకాసి హఠాత్తుగా మబ్బువేసింది. ఒక్కసారి సూర్య భగవానుని అఖండ తేజస్సుకు దట్టమైన మబ్బుతెర అడ్డొచ్చింది. ఆమూల గదిలోని మూడవ కిటికీలోనుండి వీధివైపు చూస్తూ నిల్చున్నాను. కనుచూపు మేరలో నాకు కనుపించేదేమంత సుందర దృశ్యమూ కాదు. ఆకర్షణీయమూ కాదు. నా ముందు ఊచలున్నా నా దృష్టిని ఏమాత్రం మరుగు పరచలేని కిటికీ, కిటికీ దాటగానే రకరకాల పువ్వుల మొక్కలూ, అవీ దాటగానే అందంకోసం తోట చుట్టూ వేయించిన సరుగుడు చెట్లూ, అవీ దాటగానే ప్రహరీగోడ, తరువాత సిమెంటు రోడ్డూ.

చప్పుడుకూడా చేయనంత సాఫీగా జారిపోతూందొక కారు నున్నని సిమెంటు రోడ్డుమీద. అవును, కొందరి జీవితాలుకూడా యిలానే చడి లేకుండా, ఆగకుండా, ఒడిదుడుకులు లేకుండా సిమెంటు రోడ్డుమీద పోయే కారులా గడిచిపోతాయి. కాని జీవితం అంతబాగా గడువక పోవటానికి ఏదైనా కారణం కావచ్చును. రోడ్డు చెడిపోవచ్చు, కారు చెడిపోవచ్చు, లేదా కారు నడిపేవాని మతి చెడిపోవచ్చు. ఈమూడూ ఒక్కసారి కాకపోయినా క్రమక్రమంగా జరుగవచ్చును. పనికిమాలిన ఆలోచనలు అనిపించింది.

మబ్బు దట్టమయింది. చిన్న చినుకులు ప్రారంభమయాయి. ఆయాసంగా ఉంది. దగ్గు వస్తూంది. పడుకోవాలనిపించింది.

ఆ విశాలమైన భవంతిలో ఒక్కొక్కద్వారమే దాటి పడకగది చేరుకున్నాను. మనస్సులో ఏదో మెలివేసినట్లయింది. "జీవితంలో మటుకు ఎన్నెన్ని ద్వారాలు ఎన్నెన్ని దశలు దాటలేదు! అవన్నీ దాటినది చివరికీ పడకగదిని చేరుకునేందుకేనా?" అనిపించింది.

పైన మబ్బుగా ఉండటం చేతనేమో గదిలో చీకటిగా ఉంది. గడియారం ఆరుగంటలు కొట్టింది. మంచం మీద కూర్చుని సాయంత్రం లక్ష్మి నాకు పంపించిన ఉత్తరాన్ని విప్పి మళ్ళీ చదివాను.

"లక్ష్మికి,

నేనెవరో మీకు పరిచయం చేసికుంటేనేగాని తెలియదనుకుంటాను. నేను అరుంధతినని చెపితే గుర్తుకు వస్తానేమో! ఇది మీ 'కాశ్చర్యం కల్గిస్తుంది కదూ! నేను మీకుత్తరం వ్రాయడం నిజమే! నేనే ఆశ్చర్యపోతున్నాను. ఇన్ని సంవత్సరాలుగా నేను ఏ వ్యక్తిని శంకిస్తున్నానో ఎవరినైతే శపిస్తూ వచ్చానో ఆమెకే నేనీనాడు జాబు వ్రాయటం ఆశ్చర్యం కాదూ!

ఉజ్వలంగా వెలిగే దీపపు కాంతి దాని చుట్టూ ప్రసరిస్తుంది. కాని ఆ దీపం క్రింద ఎప్పుడూ నీడే ఉంటుంది. దీపపు వెలుగును చూడలేక దీపపు నీడలోనే కొట్టుకునే ఒక క్షుద్రకీటకం ఆ నీరుతో పోట్లాడితే ఫలితం ఏమవుతుంది? దీపం ఉన్నంతసేపూ నీడ ఉంటుంది. కాని కీటకం ఆ దీపపు నీడలోనే ఆ దీపపు వేడికి భస్మమవుతుంది. చూడండీ ఏ వ్యక్తి అయినా చేసిన తప్పునుండి దిద్దుకోడానికి వేసిన అడుగును వెనక్కు వేయటానికి సాహసించటంలో పొరపాటు లేదనుకుంటాను.

నా మనస్సులో కరుడుగట్టిన కారు మబ్బులు విడిపోయాయి. పరితప్త హృదయంతో నేను దిగ్ధమైపోతున్నాను. కారణాలు ఏమైతేనేం! ఫలితం ఏమైతేనేం! నేను కట్టుకున్న అహంభావపు మేడలనుండి నేను కూలి

పోయాను ... డాక్టరుగారిని కలుసుకోవాలి. కాని భయంవేస్తుంది. వారిని చేరగలనో లేదో, వారు చేరనిస్తారో లేదో! కాని ముందు మీ వద్దకు వస్తాను. బహుశా 9వ తేదీ ఆదివారం సాయంత్రం వస్తాను. —అరుంధతి."

ఏమిటి దీని అర్థం. ఇంతకాలానికి అరుంధతిలో రావలసిన మార్పు వచ్చిందనుకోనా! ఎలావస్తుంది. ఆమె నాగురించి పూర్తిగా ఆశ వదులుకుందే! నన్ను పూర్తిగా విస్మరించింది. అయితే ఈ లేఖకు అర్థం?

అరుంధతి వస్తుంది. అనుకుంటే ఏమిటో వింతగా ఉంది. అది ఆనందమో బాధో కూడా తెలియడం లేదు. కాని ఏవో వింతభావాలు మనస్సును కలచి వేస్తున్నాయి. ఎన్ని సాయంసమయాలు శూన్యంగా దొర్లిపోయాయి. ఎన్ని రాత్రులు నిస్పృహాలో గడచిపోయాయి. ఇంతకాలానికి ఈ సాయం సమయం మెదడుకు ఆవేశాలను కలిగించే ఒక నూతన వార్తను తెచ్చింది. ఇంత కాలానికి రేపటి సాయంత్రం నా జీవిత పరిధిలోనుండి తప్పిపోయిన ఒక నక్షత్రం తిరిగి తొంగి చూస్తుందిట. తొంగి చూడటం మాత్రమే నేమో!

ఎదురుగా గోడపైనున్న నా పెళ్ళినాటి ఫోటో నన్ను వెక్కిరించినట్లయింది. ఆ ఫోటో అక్కడ ఉండడం నా కెన్నోసార్లు బాధే కలిగించింది. కాని అరుంధతి దానిని తన పవిత్రమైన చేతులతో పెట్టింది. 'తీసేయటానికి నాకేం అర్హత ఉంది' అనుకున్నాను ఎప్పుడెప్పుడో!

ఆ ఫోటోలో అరుంధతికి యిప్పటి అరుంధతికి ఎంత భేధం ఉంటుందో: చాలా మారిపోయుంటుంది. ఎంత అమాయకురాలు కాకపోతే జీవితాన్ని చేతులారా ఎడారి చేసికుంటుంది?

చిన్న వర్షం ప్రారంభించింది. కిటికీలోంచి జల్లుపడుతూంది. లేచి తలుపువేసి మళ్ళీ పడుకున్నాను. ఇంకా ఏడుగంటలే అయింది. 'ఎంత ఎడతెగని ' రాత్రి-ఎంత భయంకరమైన రాత్రి-ఇలాంటి ఎన్ని రాత్రులు గడచిపోయాయి.'

"ఒకప్పుడు-అదే-ఇరవై సంవత్సరాలకు పూర్వం ఈ రాత్రులు ఎంత ఆనందంగా ఉండేవి? రాత్రి తెల్లవారి పోతూందేమో అని బెంగ-హాస్పిటలులో కేసు వస్తే బెంగ-నాకంటె అరుంధతి యింకా విసుక్కునేది.'ఏంఉద్యోగమండీ-పగలూలేదు-రాత్రి లేదు.' అంటూ ఇదేరకపు వేసవిలో మల్లెపూవుల వాసనలతో మల్లెలను వెక్కిరించే తెల్లని జరీచీర కట్టుకుని, వంటికి మెరుగు దిద్దే పల్చని గ్లాసుమల్లు జాకెట్టు వేసుకుని, తాంబూలాలతో ఎరుపెక్కిన పెదవులతో చిరునవ్వులు వెదజల్లే ఆ అరుంధతి, ఆ రాత్రులు అప్పటి తీయని స్మృతులు, ఇప్పుడు ఎంత బాధాకరంగా ఉన్నాయి? ఆనాటి అహం భావపు ప్రౌఢ.

మనస్సుకేదో బాధగాఉంది. రేడియో పెట్టాను గీతమంజరి వినిపిస్తూంది. "గడచిన గాథలు ఏవో నామదిలో నను రేపెను ఏవో చెలరేగెను ఏవో." అని వినిపిస్తూంది. కాని ఆపాట అయిపోయింది. తరువాతిపాట బాగుంటుందేమో అనుకున్నాను.

"సంతోషమే లేని జన్మకిక సంగీతమేలనే...
ఆనందరూపమై అవతరించే గీతి ఆర్తిలో
వికృతమై అవమానమై పోవు."

నేను పాడుకునే పాటే రేడియో పాడేస్తూందనిపించింది. రేడియో ఆపేశాను.

క్రిందనించి కాలింగుబెల్లు. ఎవరో వచ్చి ఉంటారు. క్రిందకువెళ్లాను. కంపౌండరు వచ్చి "సర్! ఒక్కబ్బాయి వచ్చాడు-వంటినిండా ముళ్లు గుచ్చుకున్నాయట. కొన్ని శరీరంలో ఉండి పోయాయిట-రక్తం కారుతూంది" అన్నాడు.

"పిలువు" అన్నాను.

ఆ అబ్బాయి వచ్చాడు. ఇరవై సంవత్సరాల లోపు.

"ఏం జరిగింది?" అన్నాను.

"ఏం లేదండీ కంచె దాటబోతూంటే ముళ్లు గుచ్చుకున్నాయి. యిదిగో యిక్కడ యిక్కడ ఈ కాలిమీద ఈ చేతిలో కొన్నిలోపల ఊడిపోయాయి."

"చీకటి పడిపోయిందికదా! యిప్పుడంత తోట లోకి వెళ్లే అవసరం ఏమివచ్చింది?" అన్నాను.

ఆ అబ్బాయి అమాయకంగా నవ్వేడు. "కను చీకటిగా నున్నప్పుడు మామిడితోటలో కాయలు నాలుగు కోదామని వెళ్ళానండీ, ఇంతలో ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది. భయపడి పారిపోదామని కంచెదాటపోతే ముళ్లు గుచ్చుకుపోయాయి" అన్నాడు.

నా కాశ్చర్యంవేసింది. అతడు ఏమీ బాధ పడకుండా చెప్పేశాడు. తాను చేయబోయినది దొంగపని. శరీరంలో అంతా ముళ్లు కాని మన స్సులో ముళ్లులేవు. ముళ్ళన్నీ తీసేసి కట్లు కట్టించి పంపేశాను.

ఎనిమిది గంట లయింది. వంటవాడు వచ్చి "భోజనం వడ్డించనాండి!" అన్నాడు.

'ఊఁ!' అన్నాను తప్పనిసరిగా.

భోజనం చేశాను. కాని ఏం భోజనం! జబ్బు వాడికి మందు; యంత్రానికి ఆయిలు; నాకీ భోజనం అదేవిలువ! తృప్తిలేదు. ఆనందంలేదు. ఆప్యాయత లేదు.

కొంచెంసేపు పేపరు చదివేను. ఇంక నిద్ర పోతే బాగుండును అనుకున్నా కాని నిద్రపట్ట దుగా. మామూలే నిద్రమందు వేసికోవటం. ఒక మాత్ర వేసికున్నాను. కాని పని చేయలేదు. అంత కన్నా తీవ్రంగా పని చేస్తూంది మెదడు.

అరుంధతివస్తే మురళిని తీసుకొని వస్తుందా! మురళికిప్పుడు పాతిక సంవత్సరాలుంటాయి. ఎలా పెంచిందో! అయిదు సంవత్సరాలు నిండని బిడ్డను వెంటవేసికొని వెళ్ళిపోయింది. చలనంలేని రాయిలా బ్రతికింది.

నాకు వద్దన్నా గుర్తుకొస్తున్నాయి అప్పటి సంగతులు. నేను ప్రాక్టీసు పెట్టిన సంవత్సరానికే మురళి పుట్టాడు. వాడి జాతకం చాలా మంచి దన్నారు. నిజమే ననుకున్నాము మేముకూడా! వాడు పుట్టిన దగ్గరనుండీ నాకు విపరీతమైన ప్రాక్టీసు అతివేగం చుట్టుపట్ల నాఘనత చెప్పు కోడం ప్రారంభించారు. డబ్బుకు కొరతలేదు. పేరుకు కొరతలేదు. గొప్ప ప్రాక్టీసు. పూర్వాస్థి బోలెడంత. ఏరి కోరి చేసికొనిన అర్ధాంగి, ముద్దులు గొలిపే కొడుకు అతనికేం మహారాజు అన్నా రందరూ. మూడు సంవత్సరాలు తిరగలేదు. ఈ యిల్లు కట్టించాను. క్రిందభాగం హాస్పిటలుకు పైభాగం నివసించటానికి చుట్టూ తోట చక్కనిగాలి జీవితానికిం కేంకావాలి అనుకునే ఆ రోజుల్లో ప్రాక్టీసు ఎక్కువగా నుండటంవలన అరుంధతితో గడపవలసినంత కాలం గడుపలేక పోయానే అని బాధపడ్డాను గాని ఇంకే ఇతర చింతలులేవు. బ్రతుకంతా పూవుల బాటై విరిసి పోతుందనుకునే తీయని కలలారోజులు.

శాస్త్రి చచ్చిపోవటం నాకొక పెద్ద 'షాక్.' ఎప్పుడూ అంత ఖేదం అనుభవించలేదు. మాఅమ్మ చిన్నప్పుడే పోయింది. నాన్నకూడా ఎక్కువ తెలీని రోజుల్లోపోయారు. అప్పుడు కూడా అంత బాధపడలేదేమో!

ప్రాక్టీసుపెట్టగానే నేను పెట్టుకున్న కంపౌండరు శాస్త్రి. అతను లేకపోతే నా ప్రాక్టీసు, పేరు అంతవృద్ధి అయేదికాదనుకుంటాను. నిజానికి ఎంత మంచివాడు! పాపం నాకంటె ఎంతో పెద్ద వాడు కాడు; నేనంటే పరమభక్తి. నేను ఒకసారి చూచిన కేసును తాను పదిసార్లు చూసేవాడు. నేనొక్క మంచిమాట చెప్పివస్తే తాను పదిమంది మాటలు చెప్పి రోగికి ధైర్యం చెప్పేవాడు. చాలా తెలివైనవాడు కూడా. హఠాత్తుగా అతనికి టైఫాయిడు వచ్చింది. అతనిని మృత్యువునుండి తప్పించటానికి నేను చేసిన కృషి అంతా వ్యర్థం అయింది. వారం రోజులు తిరుగకుండానే చని పోయాడు.

శాస్త్రి చనిపోయి నెలరోజు లయింటుంది. ఒకరోజు సాయంకాలం నా కన్సల్టింగ్ రూమ్‌కి ఒక ఇరవై సంవత్సరాల యువతి వచ్చింది. నమస్కారమండీ అన్నది. తలుపుచాటున నుంచునే!

"ఎవరమ్మా! ఏంకావాలి" అన్నాను ఏదో వ్రాసుకుంటూ.

"నేను శాస్త్రిగారి భార్యను! అన్నదామె సంకోచిస్తూ. ఒక్కసారి తలెత్తి చూసాను. 'అవును శాస్త్రి భార్యే! శాస్త్రి జబ్బులో ఈమెను చాలా సార్లు చూచాను.

"రండి కూర్చోండి"అన్నాను.

ఆమె జంకుతూవచ్చి నా ఎదుటనున్న బల్లపై కూర్చుంది.

"నేను చాలా విచారిస్తున్నానమ్మా! పాపం చిన్నవయస్సులోనే మీకింత దురవస్థకల్గింది. నేను ఎంత ప్రయత్నించినా అతను నా చేతులలోంచి దాటిపోయాడు."

"నాకు తెలుసు. మీ రాయనంటే ఎంత అభి మానంగా ఉండేవారో!" అన్నది.

నేను ఆమె ఏదైనా డబ్బు యిబ్బంది చెప్పు

కుందుకు వచ్చినదేమో అనుకున్నాను. 'మీకేదైనా డబ్బవసరమైతే చెప్పండి. సందేహించకండి' అన్నాను.

"ప్రస్తుతం నేనందుకోసం రాలేదు. నా వంట్లో సుస్తీగాఉంది." అనగానే తలపైకెత్తి చూశాను. చక్కని విగ్రహమే: కాని చామనచాయగాఉంది. అయితే ఛాయలో పాలిపోయిన లక్షణా లున్నాయి. ఇంటివద్దనుండి నడిచివచ్చినందుకే నేమో ఆమె చాలా ఆయాస పడుతూంది. మెడ నరాలు గట్టిగా కొట్టుకుంటున్నాయి. ముఖం చిరు చెమటలు పోసింది.

"ఏమిటి మీ సుస్తీ?" అన్నాను.

"ఏమీలేదు: నాదు నాలుగయిదు నెలలనుండి ఆయాసంగా ఉంటూంది. వారుండగానే వారితో చెప్పి మీచేత పరీక్ష చేయించుకోవాలనుకునే దానిని. ఏదో అశ్రద్ధయిపోయింది. ఇప్పుడు ఆయాసం ఎక్కువయింది. దానికి తోడు నేను నెల తప్పాను. మూడువ నెల వచ్చింది. నాకు అన్ని కష్టాలు ఒక్కసారే వచ్చాయి. మా అమ్మ చని పోయిన పక్షం తిరుగకుండానే మావారు పోయారు. మీకు అన్నీ తెలుసుగదా! నాకు చాలా భయంగా ఉంది. నాకొక శిశువు పుట్టినా నేను పెంచలేను. మీకాళ్ళు పట్టుకుంటాను నన్నీ బాధ నుండి విముక్తి చేయండి. నేనేదో ఏ ట్రెయినింగుకో పోయి నా త్రోవ నేను చూచుకుంటాను."అన్నది కళ్ళంట నీళ్ళు కారుస్తూ. ఆమె పరిస్థితికి నాకు చాలా జాలివేసింది. ఆమెను పరీక్ష చేశాను. నా మనస్సింకా దెబ్బతిన్నది. ఆమె గుండె జబ్బుతో బాధపడుతూంది. భయంకరమైన పరిష్కారంలేని హృద్రోగం! దానికి తోడు ఆమె గర్భవతి. గుండె జబ్బంటే సామాన్యమా: ఎంతో జాగ్రత్తపడితే మనిషి జీవితం పొడిగించగలం కాని చెడిపోయిన గుండెను పూర్తిగా బాగుచేయలేం! ఈ విషయం ఆమె కెలా తెలియపరడం? ఏమిటి నా కర్తవ్యం? నా కామెమీద చాలా జాలివేసింది.

"మీకు గుండె కొంచెం బలహీనంగా ఉంది. ఫరవాలేదు. మీరు విశ్రాంతి తీసికోవాలి నేను మందులిస్తాను. క్రమంగా మీరు కోలుకుంటారు. మీరు గర్భవతినని భయపడుతున్నారు. శాస్త్రి పిల్లలు లేరని ఎంతో బాధపడేవాడు. అతడు చనిపోయినా అతని ఆత్మ సంతృప్తి కొరకైనా ఒక శిశువు జన్మించటం సంతోషించదగిన విషయం. మీ జీవితానికదే ఆశ ఆధారం అవుతుంది మీరు మరొక లాంటి తలపులు పెట్టుకోకూడదు. ఇప్పటి మీ ఆరోగ్యపు పరిస్థితి మీరే ఉద్యోగం చేయ టానికీ అనుమతించదు. నేను మీకు కావలసిన ధనసహాయం చేస్తాను. మీరు దిగులు పడకండి" అన్నాను.

అదే మొదలు లక్ష్మితో నా పరిచయానికి. ఒక అనాథగా, రోగిగా, గర్భవతిగా నన్నాశ్ర యించిన లక్ష్మి క్రమక్రమంగా నా జాలి.ఆదరణ అభిమానాన్ని పెంపొందించుకుంది. ఆమె జబ్బును మళ్ళించటానికి నేనెంతో ప్రయాస పడవలసి వచ్చింది. అనేక సార్లు ఆమె యింటికి వెళ్ళాను. గంటలకొలదీ అక్కడే ఉన్నాను. అయితే ఆమెను కేవలం రోగిగానే చూశానని చెప్పలేను. ఆమె నా హృదయంలో ఏదో చెప్పలేని స్థానాన్ని ఆక్ర మించుకుంది. నాకు తెలియకుండానే నా హృదయం ఆమెవైపు పరుగులెత్తేది. ఆమెను చూడకుండా ఉండలేక పోయేవాడిని. ఆమెలో ఏదో వింత ఆకర్షణ ఉంది. కాని ఆమె విష యంలో ఎప్పుడూ నా పరిధులను దాటలేదు. నాలో అప్పుడప్పుడు కొంత సంచలనం కలిగింది. దానిని సరియైన సమయంలో కనిపెట్టి లక్ష్మి నాకళ్ళు విప్పింది. ఆమెను నేను ప్రేమించానా! నాకే తెలీయదు. ఏదో చెప్పలేని అనుబంధం! ఆ అనుబంధమే నా జీవితంలో వసంతపు వెలుగులు జారిపోవటానికి కారణం! అరుంధతి కనిపెట్టింది. కొంతకాలం జార్చింది. తరువాత తన మనస్సు లోని బాధను బయటకు వెలిగ్రక్కింది. మా యిద్దరి మధ్య దూరం ఎక్కువవటం ప్రారంభ మయింది. లక్ష్మితో నాకు భౌతికమైన సాంగత్యం కూడా ఉందని భ్రమపడింది. భర్త చనిపోయిన ఎనిమిదిమాసాలకు లక్ష్మికి ఆడపిల్ల పుట్టింది. అది కూడా నా పాపఫలమేనని నమ్మింది. నేనెంతో నచ్చచెప్పాను.

"లక్ష్మియందు నా కభిమానమున్నమాట వాస్త వమే కాని నీవుపడే అపోహాలకు అర్థంలేదు. ఆమె భర్త చనిపోయినప్పటికి రెండు మాసాల గర్భవతి అందుకే ఆయనచనిపోయిన ఎనిమిదిమాసా

లకు బిడ్డపుట్టింది. నీవు చాలా పొరపడుతున్నావు" అని.

ఆమె నామాటకు విలువ నివ్వలేదు. "నెలల కేంలెండి! ఏడు మాసాలకుకూడా పుట్టిన వాళ్లున్నారు. భర్తతో ఎనిమిది సంవత్సరాలు కాపురం చేసినదామె! అన్నాళ్లు పుట్టని పిల్ల యిప్పుడెలా పుట్టినదో అర్థం అయింది. మీరామెను గురించి ఎందుకంత శ్రద్ధ తీసికుంటున్నారో కూడా అర్థం అయింది. నాకళ్లు కప్పటానికి మీరు ప్రయత్నించలేరు" అన్నది.

ఆ దినం తెల్లవారితే ఉగాది అనగా ఆ అమావాశ్య దినం లోకంలోని చీకట్లతోపాటు జీవితం కూడా చీకటైపోయిన ఆరోజు రాత్రంతా అరుంధతికీ నాకు ఘోరమైన వాగ్వివాదం జరిగింది. నేను చాలా శాంతంగా చెప్పాను. అయినా ఆమె మనస్సు మారలేదు. 'స్త్రీబుద్ధి ప్రళయాంతకరిః' అని ఆడుదాని మనస్సులో అనుమానం కలుగకనే పోవాలి. కలిగితే ఉత్సాహమే ఫలితం దానికి నిష్కృతిలేదు. లక్ష్మి మొహం చూడనని ప్రమాణం చేయమన్నది. ఆమె నెక్కడకైనా పంపించేయమంది. ఆమెను పూర్తిగా మరిచి పోవాలన్నది.

కాని నా అభిమానం దెబ్బతిన్నది. కేవలం ఆమె కోరిందికదా అని నేనెందుకు లక్ష్మిముఖం చూడననాలి? నేనెంతో ప్రయాసపడి ఆమె బ్రతుకును నిలబెట్టాను. ఆమెకు తనది అనే శిశువు కలిగింది. నా అండలేకపోతే ఆమె ఆ శిశువును పెంచలేదు. ఆమె నిత్యమూ రోగే. ఎప్పటికీ మామూలు మనిషికాదు. ఒక అనాథను చేరదీయటం—కాకపోతే ప్రేమించటం—తప్పా. నేను ఆమెపై ఎన్నడూ ఏ అత్యాచారమూ చేయలేదే! కాకపోతే నా హృదయంలో ఏదో ఒక స్థానాన్నిచ్చేను. అది విధివిలాసం. అరుంధతికి నేనెన్నడూ లోపం చేయలేదు. ఆమెను కించపరచలేదు. నా ధర్మాన్ని నేను విస్మరించలేదు. అయినా నన్నర్థం చేసికోలేక పోయింది. నాయందు దోషంలేక పోయాక నేనెందుకు తలఒగ్గాలి?

ఆమెకోరిన వాగ్దానం నేను చేయలేక పోయాను. ఆమె బుసకొట్టిన త్రాచుపాములా 'నేను మీకేం పనులు చేస్తున్నా మీదగ్గరే పడి ఉంటాననుకోకండి-నాకు మా నాన్నగారు బోలెడు ఆస్థి వ్రాసి చనిపోయారు. నన్నాదరించే అన్నగారున్నారు. ఇక్కడ ఉండే అవసరం నాకేంలేదు.' అంటూ వెంటనే ప్రయాణమైంది బిడ్డతో సహా. ఆమె శ్రీమంతుని కుమార్తె. తండ్రి జిల్లా కలెక్టరు పనిచేసి స్వర్గస్థుడైనాడు. ఒక్కగానొక్క కుమార్తెకు బోలెడు ఆస్థివ్రాసి చనిపోయాడు. ఆ ఆస్థికిచ్చిన విలువకూడా నాకివ్వలేదామె. తనమాటకడ్డులేదనే రాజ్యంలో పుట్టిపెరిగిన దామె. ఆమె వరకూ చదువుకున్నది సంస్కారంగలది అనుకున్నాను. ఆమె మూర్ఖతకు నేను స్తంభించి పోయాను. ఆమెను వెళ్ళవద్దని బ్రతిమాలలేదు. అడ్డుకోలేదు. అంతే! ఆమె వెళ్ళిపోయింది.

ఆ తరువాత నా అభిమానాన్ని చంపుకుని ఒకటి రెండు ఉత్తరాలు వ్రాశాను.

"ఇప్పుడు మించిపోయినదేమీ లేదు. నీవు చాలా పొరపడ్డావు. అర్థం అవకాశంలేని అపోహలతో నిజం తెలుసుకోకుండానే నీ సంసారం పాడు చేసికుంటున్నావు. మరొక్కసారి ఆలోచించు" ఈ ధోరణిలో కాని నా ప్రయత్నం ఫలించలేదు.

ఇప్పుడప్పుడు ఆనోట ఆనోట అరుంధతీ మురళీ క్షేమంగానున్న వార్తలుమాత్రం తెలుస్తున్నాయి. కొంతకాలం హైదరాబాదులో అన్నగారితో పాటు ఉండట. తరువాత ఆయనకు బొంబాయిలో ఉద్యోగమయిందట. అక్కడకు వెళ్ళి పోయారని తెలిసింది. అయిదారు సంవత్సరాలుగా వారిగురించిన సమాచారమేమీ తెలియడంలేదు.

కాలం దొర్లిపోతూంది. ఉత్సాహం చచ్చిపోయినా ప్రాక్టీసులో శ్రద్ధమానలేదు నేను. యథోచిత రీతిని నేను చేయగల్గినది చేస్తూనే ఉన్నాను. ప్రజలుకూడా నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. లక్ష్మికొక యిల్లు కట్టించాను. ఆమె అందులోనే ఉంటూంది.

లక్ష్మి విషయంలో ఒకటి రెండు సార్లు చలించాను. కాని... కాని ..మనస్సు బుద్ధిచెప్పింది అంతే!

అరుంధతి వింత ప్రవర్తనకు లక్ష్మి చాలా బాధపడింది. నన్ను ఎన్నోసార్లు గుచ్చిగుచ్చి అడిగింది కారణం ఏమిటని. కాని నేను చెప్పలేక పోయాను. చెప్పలేనన్నాను. తన కారణంగానే

మా యిద్దరి జీవితాలు విడిపోయాయని ఊహించుకుని చాలా బాధపడింది. కాని తనబిడ్డ విషయమై అరుంధతికున్న అపోహమాత్రం ఆమె ఊహకందలేదు. నేను తెలియచేయనూ లేదు.

లక్ష్మి "నేను వెళ్ళి ఆమెను బ్రతిమాలి తీసుకవస్తాను." అన్నది. నేను వారించాను. లక్ష్మి వెళితే అరుంధతి ఆమెనెంత అవమాన పరుస్తుందో నాకు తెలుసు.

ఉష పెద్దదయింది. చదువు చెప్పిస్తున్నాను. యిప్పుడు మద్రాసులో మెడికల్ కోర్సు చదువుతూంది. ఆమె చదువు ముగించివస్తే ఇంక నేనీ ప్రాక్టీసునుండి విశ్రాంతి తీసికుంటాను. అదే నాలో శేషించిన ఆశయం.

కాని నా కప్పుడప్పుడనిపిస్తుంది. ఎక్కడి శాస్త్రి ఎక్కడి ఉష. ఈ విశాలమైన భవనం, ఈతోట, ఈ ఆస్థి అనుభవించేందుకు ఆమెకెలా అర్హత కలిగింది? ఏమిటో అనుబంధం? నా అనేవారు నాకు దూరమై నావాళ్లు కానివాళ్లు నాకు వారసులై పోవటం ఎంత విచిత్రం!

వర్షం జోరుగా పడుతూంది. వైశాఖంలో వర్షమేమిటో! అన్నట్లు రేడియోలో చెప్పాడు వచ్చే ఇరువైనాల్గు గంటలు ఉరుములు మెరుపులతో ఆంధ్ర అంతటా వర్షం పడుతుందని.

గోడ గడియారం గంటలు కొడుతూంది. రాత్రి గడిచిపోతూంది. నిద్రమాత్రం రాలేదు. పైన వర్షం లోపల గాలివాన. ఈ రెండిటికీ శరీరం తట్టుకోలేక ఆయాసపడుతూంది. పడదూమరి.

వయస్సు మళ్ళింది. వెంద్రుకలు నెరిశాయి. నున్నటి అందమైన ముఖం ముడుతలుపడి నన్నే వెక్కిరిస్తూంది.

'జీవితమంతా వృధాగా గడిచిపోయింది'అనుకున్నాను. "ఎందుకూ వృధా! అరుంధతి లేదనేనా? పిచ్చివాడా! నిన్నర్థం చేసికోలేని మనిషికోసం నువ్వెందుకోయ్ అంత బాధపడతావు?"అని మనస్సు నా వెన్ను చరించింది.

"అవును, నిజం! అరుంధతి నాకేమీ కాదు. హృదయం పాషాణం. ఆమె హృదయంలో ప్రేమకు స్థానంలేదు, సానుభూతి సహనం అసలే లేవు. ఇప్పుడు మనసు మారిందా? ఎలా మారుతుంది? అప్పటి అపోహాలిప్పుడేమయాయి?"

ఆమె వస్తుంది. ఆమె ఏమనుకుంటుంది? నేను లక్ష్మితో సంసారంచేస్తున్నాననుకుంటుంది. ఇక్కడకు వచ్చేకకూడా అలానే అనుకోవాలి. అనుకుంటేనే నాకానందం. నేను లక్ష్మిని యిక్కడకు తీసుకువస్తాను. నాతోనే ఉంటుంది" అనుకున్నాను. శరీరం పట్టుతప్పినా మనస్సు పట్టుతప్పలేదు.

తెల్లవారుఝాము అయింది. వర్షం పడుతూంది. అయినాసరే నేను లక్ష్మిదగ్గరకి వెళ్ళాలి. తడుస్తూనే షెడ్‌లోకి వెళ్ళి కారు బయటికి తీసుకువచ్చాను. ఇంతలో "బాబూ! ఆయాసం చచ్చిపోతున్నా" అంటూ వచ్చిందా ముసలిది. చాలా విసుగుకున్నాను. ఎప్పుడూ బహుశా అంత విసుగుకుని ఉండను. కాని ఆమెను చూచేసరికి జాలి వేసింది. ముసల్ది వర్షంలోతడుస్తూ ఆయాసపడుతూ వచ్చింది. ఆ ఇంజక్షనుకోసమే వచ్చింది. విడువలేని మమత- ఇంజక్షను యిచ్చాను- నిముషాలమీద ఆయాసం తగ్గింది. "నీకు కోటిదండాలు స్వామీ! చల్లని తండ్రివై...అంటూ ఏమేమో దీవిస్తూ వెళ్ళింది.

ఎందుకూ దీవెనలు? ఎంతమంది ఎన్నిసార్లిలా చేయెత్తి దీవించలేదు. ఏమిటి ఫలితం? అదృష్టం మారుతుందా?

ముసలిది వెళ్ళగానే కార్లో కూర్చుని కారు స్టార్ట్‌చేశాను. తోటదాటనేలేదు. మళ్లీ మరొక విపత్కర సంఘటన-ఎవరో ఒకామె మూడు దినములనుండి ప్రసవవేదన పడుతూందట, అనేక వైద్యాలు చేయించారుట. కాని ప్రసనించలేదుట. ఏమిటా వైద్యాలు అని వివరణ కోరితే నాటు మంత్రసాని, చదువుకున్న మంత్రసాని, క్రొత్తగా ఊళ్ళో ప్రాక్టీసుపెట్టిన కాంపౌండరు అదీ ఫలించకపోతే మంత్రంవైద్యుడు. అంతా ఎవరికితోచిన వైద్యం వారు చేశారుట. కాని ఆమె ప్రసవించలేదుట. స్పృహకూడా తప్పిపోయిందట.

ఊళ్ళో చదువుకున్న డిగ్రీలు పొందిన లేడీ డాక్టరు ఉన్నది. లేకేం అక్కడికికూడా వెళ్లారుట.

తల్లీ పిల్లా బ్రతకాలంటే వందరూపాయలు, పిల్ల ఏమైనా తల్లిబ్రతికితే చాలంటే ఏభైరూపాయలు ముందు చెల్లించితేనే డాక్టరుగారు వస్తారన్నదట ఆసుపత్రిలో నర్సు. ఈ వ్యాపార సరళికి వాళ్ళు

పాదలిపోయారు. చావుబ్రతుకుల మధ్య వెనక మాడటం దేనికని నావద్దకు తీసుకువచ్చారామెను.

బయటకితీసిన కారును మళ్ళీ షెడ్‌లో పెట్టాను. పధ్నాలుగు సంవత్సరాలు సంసారిక జీవితంలో తపస్సుచేసి ఒక మగశిశువును కన్నది-అతిబ్రహ్మాండం మీద ఆ తల్లి. కాని పిల్లవాడు చచ్చిపోయి పుట్టాడు. తల్లి బ్రతికుండీ కుమిలి కుమిలి చనిపోతూంది. బహుకాలపు తపస్సు, ఆశ, నోముల పంట ఈ చచ్చిపోయిన మగశిశువేనా? తన గర్భంలో కదిలిన ప్రతి కదలికలో బరువెక్కిన ప్రతి నిముషంలో ఎన్ని తీయని కలలు, ఎంత దూరపుటలలు?

అనంతమైన ఈ విశ్వంలో దేనితోనూ, ఎవ్వరితోనూ ఏమీ సంబంధంలేని ఆ శిశువు పదినెలల పాటు తనతో పెరిగి తనలో యిమిడి తన హృదయంలో ఉయ్యాలలూగి జోలలు పాడించిన ఆ శిశువు తల్లి హృదయంలో చిచ్చుపెట్టింది.

“నా బిడ్డ బ్రతకలేదూ” అనే వేదనాభరమైన ఒక్క నిట్టూర్పుతో తల్లి నీలికళ్ళల్లో నీలిమలు ప్రవహించాయి.

లక్ష్మి ప్రసవించిన రోజు గుర్తుకువచ్చింది. సరిగ్గా ఇదే గడ్డుపరిస్థితి- ఎంత బాధపడింది. కాని అదృష్టం, బిడ్డ బ్రతికింది. ఆరోజు లక్ష్మి చావుబ్రతుకులలో ఉంది. నా మనస్సు విపరీతంగా ఆరాటపడింది. ఎంతో శ్రమపడి తల్లినీ బిడ్డను బ్రతికించగలిగాను. ఆదినమంతా నాకు భోజనంలేదు, విశ్రాంతి లేదు.

రాత్రి తొమ్మిదిగంటలయాక ప్రసవించింది లక్ష్మి. ఆమెకు తెలివివచ్చి మాట్లాడేదాకా అక్కడే కూర్చున్నాను. తెలివివచ్చాక బిడ్డను చూసుకుంది. “అంతా మీ దయ. మీరు ఉదయం నుండి శ్రమపడుతున్నారు. ఇక విశ్రాంతితీసుకోండి” అన్నది.

“ఫరవాలేదులే శ్రమకు ఫలితం కలిగింది కనుక నాకు చాలా ఆనందంగా ఉంది. మురళి పుట్టినప్పుడు అరుంధతి కూడా కష్టపడింది. కాని ఎందుకనో నేనాడు యింత ఆవేదన పడలేదు”అన్నాను.

లక్ష్మి నవ్వింది. “ఈ బిడ్డ నాబిడ్డ కాదు, మీ బిడ్డే. దీని భవిష్యత్తు మీ చేతిలోనే ఉంది”అన్నది.

“అవును నా బిడ్డే. తప్పకుండా ఈ శిశువుకు మంచి భవిష్యత్తు కల్గిస్తాను” అన్నాను హృదయపూర్వకంగా.

అరుంధతి అప్పటికే రెండుమూడుసార్లు కబురు పంపింది,వచ్చి భోజనంచేసివెళ్ళమని. నాకేం తెలుసు తనే స్వయంగా నన్నుపిలవడానికి వచ్చిందని, హాస్పిటలులో నేను లక్ష్మితో మాట్లాతూండటం విన్నదని!

ఆఖరున నేను మాట్లాడిన మాటలు ఆమెలో వింత అర్థాలు స్ఫురింపచేశాయి. అందుకే లక్ష్మికి పుట్టిన శిశువు నా సాహస ఫలితమేనని నమ్మింది. “మురళి పుట్టినప్పుడు కూడా... ఇంత ఆవేదన పడలేదు”అన్న నామాటకు ఆమె తీరని వ్యథపొందింది. ఈర్ష్య, అనుమానం, క్రోధంతో ఆమె హృదయం మండిపోయింది. అదే: ఆ సంఘటనేగా అరుంధతి హృదయంలో జ్వాలలు రేపింది? అదేగా ఆమె అనుమానానికి మరింత హేతువైంది?

స్త్రీల ప్రకృతి ఎంత వింత ప్రకృతి! అందం, ఆకర్షణ, సుకుమారత, కమ్మని తావిగల గులాబీపువ్వులా చూడటానికి ముచ్చటగా ఉంటుంది. ముట్టుకుంటే ముళ్ళుగుచ్చుకుంటాయి. కదిపితే రేకులు రాల్తాయి. గట్టిగా వాసనచూస్తే వాడిపోతుంది.

స్త్రీయే మరొక స్త్రీని ద్వేషిస్తుంది. పురుషుని అనుమానిస్తుంది. స్త్రీగా తన అహంభావానికి జీవితపు లక్ష్యాన్నే బలిచేస్తుంది. కాని మాతృమూర్తిగా అది నవనీత కోమల హృదయం- కన్నబిడ్డకోసం కఠిన శిలలనే కరిగింపచేస్తుంది. కాని అందరు స్త్రీలు అరుంధతులేనా?

లక్ష్మి చాలాబాధపడింది అరుంధతి వింత ప్రవర్తనకు. తన కారణంగానే మా యిద్దరి జీవితాలు విడిపోయాయని నేనుచెప్పకపోయినా ఊహించుకుంది. నన్ను ఎన్నోసార్లు గుచ్చిగుచ్చి అడిగింది కారణం చెప్పమని. కాని నేను చెప్పలేకపోయాను. తన బిడ్డ పుట్టుక విషయమై అరుంధతికి గల అపోహ మాత్రం ఆమె ఊహించుకోలేకపోయింది. నేను తెలియచేయనూలేదు. లక్ష్మి “నేను వెళ్ళి ఆమెను బ్రతిమాలి తీసుకువస్తాను” అన్నది కూడా. కాని నేను వారించాను. లక్ష్మి నిజంగా వెళితే అరుంధతి ఆమెనెంత అవమానించగలదో నాకు తెలుసు.

తెల్లవారిపోయింది. అవసర కృత్యాలు తీర్చుకుని లక్ష్మి యింటికి వెళ్ళాను. ఆరుమాసములనుండి

ఆమెకు జబ్బు తిరగబడింది. పూర్తి విశ్రాంతి కావాలన్నాను. మంచంమీదనుంచి లేవటంలేదు. అన్ని పనులు చేయటానికి నిత్యమూ ఉండే దాది ఉంది.

"రండి, కూర్చోండి!"అన్నది అతి ఉత్సాహజనకమైన చిరునవ్వుతో నన్నాహ్వానిస్తూ.

"లక్ష్మీ! నేను నిన్ను మా యింటికి తీసుకువెళ్ళిపోతాను. అక్కడే ఉందువుగాని. అరుంధతి ఈదినం వస్తున్నానని నీకు వ్రాసింది కదూ! ఆమె వచ్చేసరికి నీవు నాదగ్గరే ఉండాలని నా కోరిక" అన్నాను గంభీరమైన ముఖంపెట్టి.

లక్ష్మి అన్నది: "అలానే వస్తాను; దానికేంగాని, అరుంధతి నిన్నరాత్రే యిక్కడికి వచ్చింది. మీకిది చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది కదూ! మీకు కబురు పంపాలంటే వర్షంలో ఎవరూ వెళ్ళేవారు లేక పోయారు. ఆమె మనస్సులో మబ్బులన్నీ విడిపోయాయి."

"ఏమిటీ! నిన్నరాత్రేవచ్చిందా? ఏదీ"అన్నాను ఏదో తెలియని ఆవేశంతో.

"స్నానానికి వెళ్ళింది. క్లుప్తంగాచెప్తాను వినండి- అరుంధతీ మురళీ బొంబాయిలో వాళ్ళ అన్నగారితో ఉంటున్నారనికదూ మీరు చెప్పారు. ఆరుసంవత్సరముల క్రిందటే అబ్బాయిని తీసుకుని మద్రాసులో కాపురంపెట్టి అతనికి మెడికల్ చెప్పిస్తూందట. మీ అబ్బాయికి ఉష రెండు సంవత్సరముల జూనియరుట. కాలేజీలో వీరిద్దరికీ పరిచయమై తరువాత క్రమంగా ఒకరినొకరు ప్రేమించుకున్నారట. కాని ఉష ఫలానా అని మొన్న మొన్నటి వరకూ అరుంధతికి తెలియదట. ఏదోసందర్భంలో ఉష నాబిడ్డ అని తెలుసుకున్నదట. వీరిద్దరూ మీ రక్తం పంచుకుని పుట్టినవారే అనే అపోహలో ఉషకి విషయం తెలియచేసి ఆమె మనస్సు మార్చాలనే ప్రయత్నంలో తన అనుమానం నిజం కాదని తెలుసుకోగలిగిందట. ఇంతకీ ఉష పుట్టుక విషయమై ఆమె మనస్సులో ఇలాంటి దురూహలున్నాయని ఎన్నడూ నాకు చెప్పలేదేం! మీరెంత నిగూఢమైన మనుష్యులండీ!" అన్నది.

"చెప్పి నిన్ను బాధపెట్టటం, నీమనసు కించపరచటం నా కిష్టంలేకపోయింది. అయితే ఉష చెప్పినంత మాత్రాన అరుంధతి నిజమెలా తెలుసుకోగలిగింది? అన్నాను.

"ఉష నాకు సోదాహరణంగా వివరించింది. ఒక్క తప్పులో నా జీవితమును నేనెలా భస్మం చేసి కున్నానో నా కర్థమైంది." అన్నది వెనుక నుంచి వచ్చి అరుంధతి.

ఆమె దూరంగా నిల్చుండి పోయింది.కన్నెత్తి నా వైపు చూడలేక పోయింది. ముఖం కప్పుకుని ఏడ్వసాగింది. నేను చూచాను. ఎంతమారిపోయింది! యౌవనపు ఛాయలు తిరిగిపోయాయి. ఇప్పుడామె పాతికేళ్ళ కొడుకు తల్లి.

"అరూ!" అన్నాను అప్రయత్నంగా. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆనందమో దుఃఖమో తెలియని ఆవేశం.

"నన్ను జన్మజన్మాలకు క్షమించలేరు మీరు" అంటూ నా కాళ్ళమీద బడింది. ఏకధారగా కళ్ళంట నీళ్ళు కార్చుతూ స్పర్శసుఖాలను మరిచి పోయి మోడువారిన చేతులతో లేవనెత్తుతూ 'లే-విచారించకు' అన్నాను ఏమనాలో తెలియక. ఆమె అలానే నా కాళ్ళదగ్గిర కూలబడింది.

"నాకు నేనై స్వర్గాన్ని జారవిడుచుకున్నాను. నా సర్వస్వానికి దూరమైపోయాను. మిమ్మల్ని అనుమానించి నన్ను నే నవమానించుకున్నాను. ఇరువై సంవత్సరాలలో నే నేమైపోయానో ఎలాగ గడిపానో మీకు తెలియదు. మీ రెలాఉన్నారో తెలుసుకునే ప్రయత్నం నేను చేయలేదు. ఆత్మగౌరవమనే పేరుతో అహంభావానికి బలియై పోయాను. మిమ్మల్ని విడిచిపెట్టి భర్త అదుపాజ్ఞలు, సంసారిక జీవితపు సుఖాలకు దూరమై బ్రతికాను. కాని మురళిని నా సర్వస్వంగా ప్రేమించి పెంచాను. వాడికోసం ఏదైనా చేయాలనుకున్నాను. తండ్రి అండలో పెరుగలేదనే లోపం తప్ప వాడికింకేలోపం కలుగకూడదనుకున్నాను. సాధ్యమైనంత వరకూ అలానే పెంచాను. వాడిని కూడా మీ వృత్తిలోనే పెట్టాలనుకున్నాను. వాడి చదువు కోసమే నా అన్నగారి వద్దనుండి వచ్చేసి మద్రాసులో కాపురం పెట్టి మెడికల్ చదివించాను. మీ గురించి ఇంతకాలం వాడికి ఏవేవో చెపుతూ నిజం దాస్తూవచ్చాను"

"ఏవేవో చెపుతూ..." మనస్సు చాలాబాధ పడింది.

'అసలు నేను బ్రతికున్నానని తెలుసా మురళికి?' అన్నాను. ఆవేదనతో ఆమె కెవ్వుమంది. "అంత మాటనకండి. మీరు ప్రపంచంలోనే లేరని చెప్పే టంత పాపాని కొడిగట్టలేదు. కాని వాడికి ఊహ వచ్చినప్పటినుండి మీగురించి దురభిప్రాయమే కలిగే వాతావరణం ఏర్పడింది. నేను నావాళ్ళు మీ ప్రసక్తి వచ్చినపుడల్లా మిమ్మల్నీసడిస్తూ వచ్చాము. ఆ లేతహృదయంలో మీరు స్మరించ రాని వ్యక్తిగా మూర్తీభవించబడ్డారు. మీరు నీతి గల మనుష్యులు కారని మీ ప్రవర్తన మంచిది కాదని వాడికి అర్థమైంది. కాని వ్యక్తిగతంగా మన చరిత్ర వాడికి తెలియనే తెలియదు.

"మురళికి ఉషకి కాలేజీలో పరిచయమైంది. ఉష చురుకైనది, అందమైనది. అబ్బాయికి ఈడు జోడు. వారి స్నేహం వృద్ధి అయింది. నేను స్వయంగా వారిని ప్రోత్సహించాను. ఉషకు నాదగ్గిర కూడా చనువయింది. క్రమంగా మాటల సందర్భంలో ఉష తల్లిపేరు, ఊరు ఉనికి తెలిసింది. నాలో తుపాను రేగింది. ఉష మీ బిడ్డ అనే అపోహ మురళి మీ బిడ్డ అనే సత్యం—వీరిద్దరి కలయిక 'ఎలా దీనిని ఆపటం? ఎలా దీనిని తెలియ చేయటం!' అనే నా మనోవ్యథకు అంతులేదు. 'మురళికి ఏంచెప్పాలో ఏంచెపితే ఎలా బాధపడు తాడో ఆ యువక హృదయంలో ఏం పరిణా మాలు వస్తాయో — వారిద్దరూ ఏనాడో ఏకమై పోయారే — ఎలా , వారిని వేరుచేయటం-' అని భరింపరాని ఆవేదనతో సతమతమై పోయాను.

"ఏంచేయాలో తోచక మురళికి యీ విష యాన్ని చెప్పి నొప్పించలేక చివరకి ఉషకే నిజం చెప్పి ఏదో పరిష్కారం చేయాలని సంకల్పించాను. కాని...కాని నా మనస్సులో మబ్బులు విడి పోయాయి. నా జీవితం సర్వనాశనం చేసికున్నా నా బిడ్డ జీవితానికి వెలుగు ప్రసాదించాడు భగ వంతుడు."

ఇప్పుడుమాత్రం నీ అపోహ నిజంకాదని ఎలా ఋజువైంది? అన్నాను కుతూహలంతో.

"నన్ను చెప్పనీయండి. ఉషతో ఈ విషయం మాట్లాడాలని హాస్టలుకు వెళ్ళాను. ఆమె గదిలో ఆమె ఒక్కతే ఉన్నది. ఒకప్రక్క టేబిలుమీద శాస్త్రిగారి ఫోటో మరొక ప్రక్క మీ ఫోటో ఆమెగదికి వెలుగు నిస్తున్నాయి. ఆ దృశ్యం చూడ గానే మనస్సులో ఏదో బాధకలిగింది. నే నాద రించలేకపోయిన మా ఫోటోను ఆమె పూజిస్తూంది.

"ఉషా! ఈ ఫోటోలు ఎవరివి?" అనడిగాను.

"ఇది మా నాన్నగారిది. ఇది ఒక డాక్టరు గారిది. వీరే నన్ను పెంచి పెద్దచేసి చదివిస్తున్న వారు. మా నాన్నగారు నేనుపుట్టకముందే చనిపో యారు. అప్పటినుండి మా అమ్మను, నేను పుట్టాక నన్ను వీరెంతో ఆదరిస్తూవచ్చారు"అన్నది.

"ఈ డాక్టరుగారెక్కడున్నారు. వీరికి పిల్లలా" అన్నాను కుతూహలంతో.

"వారు మా వూళ్ళోనే ఉంటున్నారు. వారికి ఒక కొడుకున్నాడట. కాని చాలా కాలం క్రితమే వారి భార్య కొడుకును తీసికొని ఏదో కారణం చేత ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయిందట. తిరిగి రాలేదట."

"మురళి ఈ ఫోటో ఎప్పుడైనా చూశాడా" అన్నాను.

"లేదండీ. మగవాళ్ళను హాస్టలులోనికి రాని య్యరుగా. ఏం మురళికి డాక్టరుగారిని తెలుసా?" అన్నది.

నేను విషయమంతా చెప్పాను. ఉష శాంతంగా విన్నది. ఉష రెండు చేతులూ పట్టుకుని "ఈ విషయం నీ మనసులోనే దాచుకోవాలి-మురళికి తెలియటం నా కిష్టంలేదు. నీవే ఏదో సాకుచెప్పి అతనినుండి తప్పుకో" అని బ్రతిమాలాను.

ఉష ముఖం ఎర్రబడింది. ఒక్కసారి కలవర పడింది. మళ్ళీ సర్దుకుని 'మీరు చాలా పెద్ద పొర పాటు చేశారని యిప్పుడు తెలిసింది. మురళి ఫలానా అని నాకింతకాలం తెలియదు. నేనొకటి రెండుసార్లు తనని తనతండ్రి గురించి ప్రశ్నించాను. కాని ఏదో చెప్పాడు. అతడు నాకు నిజం చెప్ప లేదని యిపుడు తెలిసింది.

'మీ అపోహ నిజం కాదని నేను చెపితే నమ్ముతారా? నన్ను పెంచిన తండ్రి తండ్రికంటే ఎక్కువ దైవం డాక్టరుగారే కాని నా అసలైన తండ్రి శాస్త్రిగారే. నమ్మకం లేకపోతే మాయింటికి రండి. మీకు ఋజువు చూపిస్తాను. మా నాన్న గారు చనిపోయేముందు మా అమ్మమ్మకు జబ్బు చేసిందట. అపుడు మా అమ్మ పుట్టింటికి వెళ్ళింది.

అపుడే మా అమ్మ నెల తప్పింది. ఈ విషయం మా నాన్నగారికి ఉత్తరం వ్రాస్తే మా నాన్నగారు మా అమ్మకు జవాబిచ్చారు, అదే ఆయన ఆఖరి ఉత్తరం. మా అమ్మ పుట్టింటినుండి తిరిగి వచ్చేసరికి మా నాన్నగారికి టైఫాయిడు రావటం. ఆ తరువాత విషయాలు మీకు తెలిసినవే! ఆ ఆఖరి ఉత్తరమును మా అమ్మ ప్రాణ సమానంగా దాచుకొంది. దానిలో పిల్లలు లేరులేరని తపించే మా నాన్నగారు పుట్టబోయే శిశువు గురించి ఆయనకుగల తీయని కలలు, ఆయనలో కలిగిన మహా దానందం ఎంతో హృదయంగమంగా వర్ణించారు. మీరు నిజంగా చాలా అపోహపడ్డారు. పుట్టక ముందే తండ్రిని కోల్పోయిన ఈ అభాగ్యురాలు పవిత్రమైన తలితండ్రుల కడుపున పుట్టినదని మీరు గ్రహించటం చాల అవసరం' అన్నది.

నేను నిస్తబ్ధుడనై ఆమె చెప్పే కథనం వింటున్నాను. ఆమె ఆవేశంతో చెప్పుకు పోతూంది. "ఉష నాకళ్లు తెరిచింది. ఆనాడు మీరు చెప్పారు. ఎన్నో నచ్చచెప్పారు. కాని అనుమానంతో నిండిపోయిన నా హృదయంలో మీ మాటలకు విలువలేక పోయింది. మీరేకాదు. నాకు చాలామంది హితబోధ చేశారు. 'ఒకవేళ ఆయనలో పొరపాటుందనుకో, ఐనా అలా తెగించి భర్తను విడిచి రావటం బాగుండదని.' కాని చిన్నప్పటినుండి నేను పెరిగిన వాతావరణం నాలో అహంభావం ఆత్మాభిమానం నిలపివేసింది. మరొక స్త్రీతో చరించే పురుషునికి భార్యనై ఉండటం కంటే సంసార సుఖాలను బలిచేసుకునైనా బ్రతకటం గౌరవం అనిపించింది. ఆ అహంభావంతోనే నా జీవితమంతా గడిపివేశాను. మీ జీవితం శూన్యం చేశాను."

అనిరళమైన అశ్రుధారలు పాదాలను తడిపివేస్తున్నాయి. 'మురళిని తీసుకురాలేదా' అన్నాను ఆ ప్రశ్న యింతవరకు వేయనందుకు నాకే ఆశ్చర్యం వేసింది.

"లేదు. మీరు పోల్చుకోలేనంత పెద్దవాడయి పోయాడు. తండ్రి ప్రేమనుండి బిడ్డను వేరుచేసిన పాపఫలితం శేషజీవితంలో అనుభవిస్తాను. ఇక మీ బిడ్డను మీరు చూసుకోండి" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

చేతులు వణుకుతున్నాయి పెదిమలు తడబడుతున్నాయి. హృదయం నాకు తెలియనంత వేగంగా స్పందిస్తూంది. "అరూ! జరిగిపోయినదంతా ఒక కలనుకో. ఇంక బాధపడకు లే!" అన్నాను ఆమె తలను నా ఒడిలో ఆనిస్తూ.

ఆమె గట్టిగా నా కాళ్ళను పెనవేసికొని "అవును జీవితమంతా కలయిపోయింది. కల కరిగేసరికి జీవితమే ఆఖరు దశకు వచ్చింది" అన్నది.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మెరుస్తున్న ఆమె తలవెండ్రుకలపై వర్షం కురిపిస్తున్నాయి. పైన వర్షం కొద్దిగాతగ్గింది. ఆమె తల నిమురుతూ "యింటికి వెళదాం వస్తావా?" అన్నాను. "నన్ను రానిస్తారా" అంది దీనంగా నా కళ్ళల్లోకిచూస్తూ. "పిచ్చిదానా! నా యింటి తలుపులు యెప్పుడూ నీకోసం తెరచుకునే ఉన్నాయి-పద వెళదాం"అని లేచాను. లక్ష్మి కళ్ళల్లో ఆనంద జ్యోతులు వెల్లి విరిశాయి. నా జీవితపు చీకట్లలో ఆమె పూర్తిగా భాగం పంచుకుంది. నాతో ఏడ్చి నాతో బాధ పడి నాతోనే నవ్వుతుందామె మనసు.

రెండు దశాబ్దాల తరువాత యిల్లు కళకళలాడింది. సాయంత్రం అయిదుగంటలు దాటింది. ఆ మూల గదిలో ఆటే కిటికీదగ్గర అలా నిల్చుని రోడ్డువంక చూస్తున్నాను అదే కారు సన్నగా జారిపోతూంది. వర్షం వెలిసింది. ఆకాశం వెలుగు నిచ్చింది. పశ్చిమంలోనుండి సూర్యుని అరుణ కిరణాలు నీటి మబ్బులలోనుండి దూసుకు వచ్చి ఆకాశమంతా అదొక రకమైన వింత రంగులు పూసుకున్నాయి. నిన్న నీపాటికి మబ్బులు వేస్తున్నాయి. ఈ దినం మబ్బులు విడిపోయాయి. జీవితం కూడా యింతే-ఏమిటో వింత అనుభూతులు!

"ఏమిటి చూస్తున్నారు?" అన్నది వెనుకనుంచి వచ్చి అరుంధతి. "ఏమీలేదు వర్షం పూర్తిగా వెలిసినట్లేకదూ? ఎండ వస్తూంది!" అన్నాను

"ఆ వెలిసిందికాని, మనకిమాత్రం బుతువులు మారిపోయాయి. మనకిక వసంతాలు లేవు. గ్రీష్మం గడిచిపోయింది. శరత్తులుకూడా రావు. శిశిరమే" అన్నది నిస్పృహగా నా కళ్ళలోకి చూస్తూ. ★